## విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ



పికెట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేస్తున్న కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్

మారేడ్‌పల్లి, జూన్ 19:ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు తన వంతు సహాయ, సహకారాలు ఎల్లప్పుడు ఉంటాయని తెలంగాణ రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ అన్నారు. 'గిఫ్ట్ ఏ స్మైల్' కార్యక్రమంలో భాగంగా సోమవారం పికెట్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో 260 మంది విద్యార్థులకు నోట్ బుక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ మాట్లాడుతూ.. త్వరలో కంటోన్మెంట్‌లో 19 ప్రభుత్వ పాఠశాలల్లో 6500 మంది విద్యార్థులకు ఉచితంగా నోట్ బుక్స్ పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మోని, రఘు, సాయి, కిరణ్, వినీత్, సతీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## 'సీసీ రోడ్డు పనులు ప్రారంభించాలి'

అడ్డగుట్ట, జూన్ 19 : సీసీ రోడ్డు పనులను త్వరగా ప్రారంభించాలని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. సోమవారం సీతాఫల్‌మండి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం సమీపంలో సీసీ రోడ్డు ప్రతిపాదిత స్థలాన్ని ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సామల హేమ మాట్లాడుతూ.. పనులను సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ అన్విత్, జీహెచ్ఎంసీ ఏఈ కౌశిక్, బీఆర్ఎస్ నాయకులు జాకీర్, లోకేష్, పద్మ, అర్చన, ప్రవళికతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## 'దరఖాస్తు గడువు పొడిగించాలి'

అడ్డగుట్ట, జూన్ 19 : బీసీ కులవృత్తులకు ప్రభుత్వం అందజేస్తున్న రూ.లక్ష ఆర్థిక సాయం దరఖాస్తు గడువును పొడిగించాలని మారేడ్‌పల్లి మండల తహసీల్దార్ మాధవిని కోరారు. సోమవారం సీపీఐ పార్టీ సికింద్రాబాద్ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో నేతలు తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. దరఖాస్తు గడువు ఈ నెల 20తో ముగుస్తుండడంతో కుల, ఆదాయ ధృవీకరణ పత్రాలు అందక ప్రజలు ఆందోళన చెందుతున్నారని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు పాకాల యాదగిరి, ఖాజా మియా, కాసిం, బాలరాజు, చాంద్ పాషా, రాంచందర్‌తో తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచితంగా లైసెన్సులు అందించాలి

ఖైరతాబాద్, జూన్ 19 : దివ్యాంగులు (మూగ, చెవుడు)ల వాహనాలకు ఉచితంగా లైసెన్సులు జారీ చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ డెఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్ కోరారు. సోమవారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో వివిధ విజ్ఞప్తులతో కూడిన వినతి పత్రాన్ని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. భారతి, ఉపాధ్యక్షులు కె. వెంకటేశ్ గౌడ్‌తో కలిసి అందించారు. జాతీయ రహదారిపై టోల్ ప్లాజా ఫీజు మినహాయింపు ఇవ్వాలని, డీటీవో కార్యాలయంలో నాలుగు శాతం వివిధ కేటగిరి ఉద్యోగాలు దివ్యాంగులకు కేటాయించి భర్తీ చేయాలన్నారు.

## బీటెక్ విద్యార్థి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జూన్ 19:చెడు వ్యసనాలకు బానిసై అప్పుల బాధలు భరించలేక ఓ బీటెక్ విద్యార్థి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...యాదాద్రి జిల్లా నెమర్‌గుమ్మ గ్రామానికి చెందిన కుంచారపు సాయికుమార్ (22) బీటెక్ విద్యార్థి. చెడు వ్యసనాలకు బానిసైన సాయికుమార్ తనకు తెలిసిన వారి వద్ద డబ్బులను అప్పుగా తీసుకున్నాడు. వాటిని తిరిగి చెల్లించకపోవడంతో అప్పులు ఇచ్చిన వారి నుంచి ఒత్తిడి పెరిగింది. దీంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం మధ్యాహ్నం 3:30 గంటలకు ఘట్‌కేసర్-బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని గాంధీ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.


బోయిన్‌పల్లి మార్కెట్ ఆవరణలో మొక్కలు నాటుతున్న వైస్ చైర్‌పర్సన్ హరికాఆనంద్‌బాబు తదితరులు


నందనార్ నగర్‌లో మొక్కను నాటుతున్న అడ్డగుట్ట కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి తదితరులు

# ప్రతి బస్తీల్లో..'హరిత' పండుగ

### మొక్కలు నాటిన డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు, అధికారులు

ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం తార్నాక డివిజన్ నాగార్జుననగర్ కాలనీలో నూతనంగా ఏర్పాటైన పార్కులో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో ఉప మేయర్ అధికారులతో కలిసి పాల్గొని మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి పచ్చదనం పెంపునకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్మిక విభాగం అధ్యక్షుడు మోతె శోభన్‌రెడ్డి, జీహెచ్ఎంసీ అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ హేమలత, డీఈ సువర్ణ, శానిటేషన్ సూపర్‌వైజర్ ధనాగౌడ్, హార్టికల్చర్, శానిటేషన్, ఎంటమాలజీ విభాగం అధికారులతో పాటు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.- అడ్డగుట్ట, జూన్ 19


నాగార్జున నగర్ కాలనీ పార్కులో మొక్క నాటి నీళ్లు పడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్ రెడ్డి, పారిశుద్ధ్య కార్మికులు

● **అడ్డగుట్టలో...**

తుకారాంగేట్ నందనార్ నగర్ పార్కులో నిర్వహించిన హరితహారం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ లింగాని ప్రసన్న లక్ష్మి పార్టీశ్రేణులతో కలిసి పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో నగర గ్రంథాలయ డైరెక్టర్ లింగాని శ్రీనివాస్, పార్టీశ్రేణులు నక్క మధు, మహ్మద్, పొన్నాల రాజు, అమర్, వడ్లూరి రవి, వసంత, నర్సింగ్, శ్యాంసన్‌తో పాటు హార్టికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

● **సీతాఫల్‌మండిలో...**

సీతాఫల్‌మండి డివిజన్ మార్కండేయ నగర్ బ్లాక్ పార్కులో హరితహారం కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సామల హేమ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ దశరథ్‌తో కలిసి పాల్గొని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ సంధ్య, సూపర్‌వైజర్ సురేష్, శానిటేషన్ జవాన్లు, ఆశవర్కర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● **మెట్టుగూడలో..**

హరితహారం కార్యక్రమంలో భాగంగా మెట్టుగూడ డివిజన్ కార్పొరేటర్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు రాసూరి సునీత విద్యావిహార్ పాఠశాలలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ దశరథ్, అధికారులు పాల్గొన్నారు.


మార్కండేయ నగర్ బ్లాక్ పార్కులో జీహెచ్ఎంసీ డీసీ దశరథ్‌తో కలిసి మొక్కను నాటుతున్న కార్పొరేటర్ సామల హేమ


విద్యావిహార్ స్కూల్‌లో చిన్నారులతో కలిసి మొక్కలు నాటుతున్న కార్పొరేటర్ రాసూరి సునీత, డీసీ దశరథ్

## ఖరీదైన కారు చోరీ

బంజారాహిల్స్.జూన్ 19: ఖరీదైన కారులో షికార్లు కొట్టాలనుకున్న యువకుల సరదా పోలీసులను పరుగులు పెట్టించింది. ఒకవైపు కారు యజమాని తన కారులో అమర్చిన జీపీఎస్ పరికరంతో కారును చేజ్ చేస్తుండగా సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా పోలీసులు పరుగులు పెట్టారు. కారును తస్కరించిన సెక్యూరిటీ గార్డులను అదుపులోకి తీసుకున్న పోలీసులు కారును స్వాధీనం చేసుకున్నారు.

ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న వివరాలు ఇలా ఉన్నాయి. బృందావన్ కాలనీలోని వెస్ట్‌సైడ్ అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న బి.ఆరాధ్య శ్రీకృష్ణ అనే వ్యాపారి ఆదివారం రాత్రి 7గంటల ప్రాంతంలో తన ఫోర్డ్ ఇండీవర్ కారును శుభ్రం చేయాలని వాచ్‌మెన్‌గా పని చేస్తున్న బాబు అస్లామ్‌కు సూచించాడు. తాళాలు తీసుకున్న బాబు మరో ముగ్గురు స్నేహితులను తీసుకుని కారులో షికారుకు వెళ్లారు. అయితే రెండు గంటలు అయినా కారు తాళాలను తీసుకెళ్లిన సెక్యూరిటీగార్డులు తిరిగి రాకపోవడంతోయజమాని కృష్ణ కిందికొచ్చి చూడగా కారు కనిపించకపోవడంతో కారులోని ఫోర్డ్ యాప్ జీపీఎస్ సిస్టమ్‌లో చూశాడు. కారు మాదాపూర్ దాటినట్లు గుర్తించిన కృష్ణ వెంటనే ఫిలింనగర్ పోలీసులకు సమాచారం అందించడంతో పాటు మరొకారు తీసుకుని జీపీఎస్ ఆధారంగా కారును వెతుక్కుంటూ వెళ్లాడు. హైటెక్ సిటీ దాటిన తర్వాత కొంతదూరంలో రోడ్డుపక్కన కారు పార్కింగ్ చేయడంతో అక్కడకు చేరుకున్నాడు. అదే సమయంలో ఫిలింనగర్ పోలీసులు సైతం అక్కడకు చేరుకుని కారును స్వాధీనం చేసుకోవడంతోపాటు నలుగురు యువకులను అదుపులోకి తీసుకున్నారు. తమకు చాలా కాలంగా ఖరీదైన కారులో తిరగాలని కోరికగా ఉండేదని, దాంతో కారును తీసుకువెళ్లామని చెప్పారు. ఈ మేరకు బాధితుడు ఇచ్చిన ఫిర్యాదుతో కారు చోరీ చేసేందుకు యత్నించిన నిందితులపై ఐపీసీ 381రెడ్‌విత్ 34 సెక్షన్ల కింద ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఇందిరమ్మనగర్‌లో.. బోర్డు అధికారుల పర్యటన

కంటోన్మెంట్, జూన్ 19: కంటోన్మెంట్ రెండోవార్డులోని ఇందిరమ్మనగర్ లో సోమవారం బోర్డు చీఫ్ ఇంజినీర్ అధికారి బాలకృష్ణ, శానిటరీ సూపరింటెండెంట్ దేవేందర్, నీటి విభాగం సూపరింటెండెంట్ రాజ్‌కుమార్‌లు పర్యటించారు. బస్తీలో నీటి సరఫరా జరిగిన రోజు మోకాలి లోతు నీరు నిలిచిపోతోందని, వర్షాలు కురిసిన సందర్భంలో తాము పడుతున్న ఇబ్బందులు వర్ణణాతీతమని స్థానికులు అధికారులకు వివరించారు. నీరు నిల్వఉండే ప్రాంతాన్ని అధికారులు పరిశీలించారు. అక్కడ ఉన్న డ్రైనేజీ మ్యాన్ హోల్స్‌లో పారిశుద్ధ్య సిబ్బందితో వ్యర్థాలను తొలగింపజేశారు. కార్యక్రమంలో మార్కెట్ డైరెక్టర్ నయీం, పరశురాం తదితరులు పాల్గొన్నారు.